సాక్షి శ్రీకాకుళం

గురువారం । 15 । మే । 2025



ఎక్కడి వాహనాలు అక్కడే

శ్రీకాకుళం ఆమదాలవలస మధ్య దారి స్తంభించిపోయింది. వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

- 8లో



పోర్టు రైల్వేలైన్ పరిశీలన

సంతబొమ్మాళి: మూలపేట పోర్టుకు నిర్మించబోయే రైల్వే లైన్‌ను వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బొహ్రా బుధవారం పరిశీలించారు. పోర్టును కూడా సందర్శించి చేపట్టిన పనులపై ఆరా తీశారు.

21 కేంద్రాల్లో టెన్త్ సప్లిమెంటరీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఈనెల 19 నుంచి మొదలుకానున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 21 కేంద్రాలను కేటాయించారు. ఈ పరీక్షలు 19వ తేదీన మొదలై 28వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెగ్యులర్ పరీక్షలకు 21 కేంద్రాలను కేటాయించగా, ఓపెన్ స్కూల్ పరీక్షలకు 6 కేంద్రాలను కేటాయింపు చేశారు. సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజులు చెల్లించిన విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా పాఠశాల విద్యాశాఖ అవసరమైన ఏర్పాట్లు చేసింది.

న్యూస్‌రీల్

ట్రిపుల్ ఐటీ దరఖాస్తుల స్వీకరణకు 20 చివరి తేదీ

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)ల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 20 చివరి తేదీ. నాలుగు క్యాంపస్‌లు శ్రీకాకుళం, ప్రకాశం, న్యూజివీడు, ఇడుపులపాయలకు కలిపి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యను అందిస్తారు. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వెయిటేజ్ వంటి నిబంధనలకు లోబడి ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగు క్యాంపస్‌లకు ఆన్‌లైన్‌లో ఒకే దరఖాస్తు సరిపోతుంది. ప్రాధాన్యత ఇచ్చుకోవాల్సి ఉంటుంది. జూన్ 5వ తేదీన మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారు.

రేషన్.. పరేషాన్

సారవకోట: మండలంలోని బుడితి చిన్నవీధికి చెందిన రేషన్ కార్డుదారులకు గత నెల రేషన్ సరుకులు పూర్తి అందజేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వీధిలో ఉన్న సుమారు 50 మంది కార్డుదారులకు రేషన్ సరుకులు గత నెల అందజేయలేదని, అలాగే గత నెలో అక్కడక్కడ ఇచ్చిన రేషన్ కార్డు దారులకు ఈ నెలలో ఒక్కో కిలో బియ్యం చొప్పున తగ్గించారని నేతింటి సూర్యనారాయణ, ముద్దాడ హేమలత, రెడ్డి ముసలయ్య, పొన్నాన తాతారావులతో పాటు పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై సీఎస్‌డీటీ షరీఫ్‌కు వివరణ కోరగా గత నెలలో రేషన్ సరుకులు అందలేదని తమ దృష్టికి రాలేదని దీనిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏపీఆర్డీసీలో విద్యార్థి ప్రతిభ



విజయ్‌ని అభినందిస్తున్న ప్రిన్సిపల్ గణపతిరావు

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్‌కు చెందిన అడపా విజయ్ ఏపీఆర్డీసీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. స్థానిక సంపత్ సాయి జూనియర్ కళాశాల్లో ఇంటర్ చదివిన విజయ్ డిగ్రీలో రెసిడెన్షియల్ కళాశాలల్లో చదివేందుకు ఎంట్రన్స్ పరీక్ష రాయగా బుధవారం ఫలితాలు వచ్చాయి. దీంట్లో విజయ్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం పొందాడు. విజయ్ తండ్రి సింహాచలం లారీ డ్రైవర్ కాగా తల్లి గృహిణి. తమ కుమారుడు ఏపీఆర్డీసీలో ర్యాంకు పొందడంపై ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ గణపతిరావు అభినందించారు.

జ్ఞానరూపేశ్‌కు మూడో స్థానం

స్థానిక సంపత్‌సాయి కళాశాల విద్యార్థి జ్ఞాన రూపేష్ శర్మ ఏపీఆర్డీసీలో మూడో ర్యాంకు పొందాడు. సారవకోటకు చెందిన శర్మ తల్లిదండ్రులు కృష్ణసాయిరాం, పద్మావతి ఆనందం వ్యక్తం చేశారు.



జ్ఞాన రూపేష్ శర్మ

గుడి ఉందన్న ధ్యాస లేదు.. బడి ఉందన్న పట్టింపు లేదు..

ఎందెందు వెతికినా బెల్టుషాపులు దర్శనమిస్తున్నాయి. ఓ ఇంటి పెద్ద చనిపోతున్నాడన్న బాధ లేదు.. ఆ కుటుంబం ధ్వంసమైపోతుందన్న చింతా లేదు.. సర్కారు పెద్దలు 'ఆదాయం సృష్టి'పై మాత్రమే దృష్టి పెడుతున్నారు. మద్యం మత్తులో హత్యలు జరుగుతున్నాయన్న ఆందోళన లేదు.. ఆడపడుచులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్న ఆలోచన కూడా లేదు.. సిండికేట్లన్నీ జేబులు నింపుకునే పనిలో ఫుల్ బిజీగా ఉన్నాయి. బెల్టుషాపుల రాకతో పొద్దుటి పూట పేదోడి సంపాదన సాయంత్రానికి మందు షాపు గల్లాపెట్టెకు చేరిపోతోంది. ఫలితంగా నిరుపేద కుటుంబాలు ఛిద్రమైపోతున్నాయి.

- జిల్లాలో పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు
- ఏరులై ప్రవహిస్తున్న మద్యం
- ఛిద్రమవుతున్న నిరుపేద కుటుంబాలు
- ఎమ్మార్పీకి మించి ఇష్టానుసారం విక్రయాలు
- కూటమి సిండికేట్లకు కాసులు

నేతకు పైకం.. ఊరికి శోకం



ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంతో జరిగిన హత్యలు, అత్యాచారాలు, గొడవల వంటి సంఘనలు అనేకం ఉన్నాయి. పచ్చని సంసారాలు ఛిద్రమై కూలిపోతున్నాయి.

కొన్ని ఘటనలు..

- ఈ ఏడాది జనవరి 19న జిల్లాకేంద్రంలోని న్యూకాలనీలో పొందూరు మండలానికి చెందిన పూజారి లలితను అతి కిరాతకంగా యువకుడు చంపేశాడు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 10న సోంపేట సమీప జింకిభద్ర బీసీకాలనీలో తాగిన మత్తులో భార్యను భర్తే హత్య చేశాడు.
- మార్చి 18న ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురానికి చెందిన గాలి నాగమ్మ (42)ను ఆమె భర్త అప్పలరెడ్డి మద్యం మత్తులో దారుణంగా నరికి చంపేశాడు.
- కాశీబుగ్గలో మద్యం మత్తులో ఇద్దరు మైనర్ బాలికలపై ముగ్గురు యువకులు అఘాయిత్యానికి పాల్పడ్డారు.
- నగరంలోని బలగ వద్ద బార్ అండ్ రెస్టారెంట్ వద్ద బీరు బాటిల్స్‌తో ఇరువర్గాలు కొట్టుకున్నాయి. దీనిపై కేసు కూడా నమోదైంది.
- గత నెల చల్లవానిపేట వైన్ షాపు వద్ద గొడవ జరిగింది. పోలీసులు వచ్చి సద్దుమణిగించడంతో ఉద్రిక్తత తప్పింది. లేదంటే పెద్ద కొట్లాట జరిగేది.

జిల్లాలో ఈ జనవరి నుంచి ఇప్పటి వరకు రూ. 457కోట్లకు పైగా విలువైన మద్యం తాగేశారు.

6,33,421 ఇండియన్ మేడ్ లిక్కర్ కేసులు, 2,89,181 బీరు కేసుల మేర విక్రయాలు జరిగాయి.

జిల్లాలో ఏ స్థాయిలో మద్యం దొరుకుతుందో మందు బాబుల జేబులు ఎంత మేర ఖాళీ అవుతున్నాయో ఈ లెక్కలే చెబుతున్నాయి.



శ్రీకాకుళం పాతబస్టాండ్ వద్ద గల పాన్‌షాప్ వద్ద మద్యపానం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. ఇదివరకు గుడికి బడికి దూరంగా ఎక్కడో ఓ చోట షాపు పెట్టి మద్యం విక్రయించేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం దుకాణాలే కాకుండా బెల్టుషాపుల పేరిట ఎక్కడ పడితే అక్కడ యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు. పల్లెల్లోనైతే బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతోంది. ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రోత్సహించడం, పాలక పార్టీకి చెందిన నేతలు సిండికేట్‌గా ఏర్పడి మందుబాబులను దోచేస్తుండడంతో బడుగుల బతుకులు ఈ బెల్టు దుకాణాల ముందే తెల్లారిపోతున్నాయి. వైన్ షాపులు, బార్‌లలో సమయం ప్రకారం మద్యం లభ్యమవుతుంటే బెల్ట్‌షాపుల్లో 24 గంటలు అందుబాటులో ఉంటోంది.

ప్రజల ప్రశాంతతకు భంగం వాటిల్లేలా..

ప్రభుత్వం ఏదైనా కొత్త విధానం తీసుకువస్తే దాని వల్ల జనాలకు మేలు జరగాలి. కానీ మద్యం కొత్త విధానం వల్ల జనం జేబులు గుల్లైపోతున్నాయి. జనావాసాల్లో మద్యం షాపులు, వాటిని ఇష్టారీతిన నడిపేందుకు మద్యం సిండికేట్లు, విచ్చల విడిగా బెల్ట్‌షాపులు, ఎంఆర్‌పీకి మించి విక్రయాలు...ఇలా ఒకటేంటి అనేక రకాలుగా చెలరేగిపోవడంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తి సమాజ ప్రశాంతత ధ్వంసమవుతోంది.

అదనపు వసూళ్లు

ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు లేకపోవడం వల్ల అవాంఛనీయమైన పోటీకి దారితీసింది. ఆదాయం ఎక్కువగా వస్తుందనే ఉద్దేశంతో సిండికేట్‌గా ఏర్పడిన కూటమి నాయకులు చెలరేగిపోతున్నారు. బెల్ట్‌షాపులు అనే దుర్మార్గమైన వ్యవస్థను తిరిగి తీసుకొచ్చారు. ఊరిలో వీధికిరెండు మూడేసి షాపులు తెరిచారు. ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ. 10అదనంగా వేసుకుని బెల్ట్‌షాపులకు విక్రయిస్తున్నారు. ఆ బెల్ట్‌షాపుల వాళ్లు గ్రామాల్లోని మందు బాబులకు బాటిల్‌పై రూ. 30నుంచి రూ. 70వరకు అదనంగా వేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఇదొక పెద్ద మాఫియాగా తయారై దోపిడీ చేస్తున్నాయి.

10వేలకు పైగా బెల్ట్‌షాపులు

ప్రస్తుతం జిల్లాలో వైన్‌షాపులకు అనుబంధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో షాపుల నిర్వాహకులు, సిండికేట్లు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో షాపు పరిధిలోని గ్రామాల్లో 10నుంచి 40బెల్ట్‌షాపులు అనుబంధంగా పనిచేస్తున్నాయి. జిల్లాలో 10వేలకు పైగా బెల్ట్‌షాపులు ఉన్నట్టుగా తెలుస్తోంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి. మద్యం విక్రయాలతో పాటు మందుబాబులకు అవసరమైన ఆహార పదార్థాలను సైతం తయారు చేసి విక్రయిస్తున్నారు. బెల్ట్‌షాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లల్లోనూ, షాపుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్ట్‌షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లెట్ తదితర ఆహార పదార్థాలను వండి అందజేస్తున్నారు.



శ్రీకాకుళం పాత బస్టాండ్ సమీపంలో..

సిండికేట్లకు తావులేకుండా గత ప్రభుత్వం నిర్ణయం

పచ్చని పల్లెల్లో చిచ్చు రేపుతున్న మద్యాన్ని ప్రజలకు దూరంగా ఉంచాలని గత వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా జనావాసాలకు దూరంగా పరిమిత దుకాణాలను ఏర్పాటు చేసింది. సిండికేట్లకు ఆస్కారం లేకుండా ప్రభుత్వమే వాటిని నడిపింది. నిర్ణీత వేళల్లోనే మద్యం విక్రయాలు సాగించేది. గ్రామాల్లో బెల్ట్‌షాపులకు తావు లేకుండా చేసింది. కానీ ప్రభుత్వం మారడంతోనూ పల్లెలకు మళ్లీ ఈ దరిద్రం పట్టుకుంది.



శ్రీకాకుళంలోని ఓ కూడలి వద్ద..

29న వైఎస్సార్‌సీపీ నేతలకు సన్మానం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలువురికి కీలకమైన బాధ్యతలు అప్పగించారని, వారందరికీ ఈ నెల 29వ తేదీన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ పార్టీ అధినేత ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నేషనల్ హైవే పెద్దపాడు జిల్లా పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లాలో మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాంకు పార్లమెంటరీ సమన్వయకర్తగా, పార్లమెంటరీ పరిశీలకులుగా కుంభా రవితో పాటు పలువురికి కీలకమైన పదవులు అప్పగించారని వారందరికీ సన్మానం చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా.. పథకాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని అన్నారు. ప్రజలు దీనిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. సమావేశంలో కళింగవైశ్యకుల రాష్ట్ర అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణ, యువజన విభాగం ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మార్పు పృథ్వీ, బుక్కూరు ఉమామహేశ్వరరావుతో పాటు అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురాం, ఎన్ని ధనుంజయరావు, పొన్నాడ రుషి, ఎంఏ బేగ్, వై.వి శ్రీధర్, టి.కామేశ్వరి, యజ్జల గురుమూర్తి, ఎస్.రామారావు, రాజాపు అప్పన్న, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజవాన్‌కు నివాళి



మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ ముఖ్య నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వీర జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని ఎవరూ మరువలేరని వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆర్మీ జవాన్లకు ప్రభుత్వ పరిహారం కింద రూ.50లక్షలు ఇచ్చే సంప్రదాయాన్ని వైఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించారని గుర్తు చేశారు. ఇప్పుడు పార్టీ తరఫున రూ.25 లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు. మురళీ నాయక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. పార్టీ కార్యాలయంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలిటెక్నిక్‌లో 95.27% ఉత్తీర్ణత

- 10349 మంది పరీక్షకు హాజరు కాగా 9860 మంది పాస్
- ఉత్తీర్ణతలో బాలికలే టాప్

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఏపీ పాలిసెట్ (పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామ్)–2025 ఫలితాల్లో శ్రీకాకుళం విద్యార్థులు హవా కనబర్చారు. బుధవారం వెలువడిన ఈ ఫలితాల్లో రికార్డు స్థాయిలో 95.27శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా నుంచి 10349 మంది పరీక్షకు హాజరుకాగా.. వీరిలో 95.27 శాతంతో 9860 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈసారి కూడా బాలురుతో పోలిస్తే బాలికలే బెస్ట్‌గా నిలిచారు. ఏప్రిల్ 30వ తేదీన జిల్లా వ్యాప్తంగా (శ్రీకాకుళం, టెక్కలి డివిజన్ల పరిధిలో) 39 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 10349 మంది హాజరయ్యారు. జిల్లా నుంచి రికార్డుస్థాయిలో 11376 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.



జిల్లా నుంచి పాలిసెట్-2025 పరీక్ష గణాంకాలు ఇలా ఉన్నాయి..

	బాలురు	బాలికలు	మొత్తం
దరఖాస్తు చేసింది	6439	4937	11376
పరీక్ష రాసింది	5905	4444	10349
పరీక్షకు గైర్హాజరు	534	493	1027
ఉత్తీర్ణత సాధింపు	5572	4288	9860
ఉత్తీర్ణత శాతం	94.36	96.49	95.27

టాపర్‌గా నిలిచిన సాయిశ్రీ..

శ్రీకాకుళం జిల్లా నుంచి పలువురు విద్యార్థులు మెరుగైన ర్యాంకులతో సత్తాచాటారు. 120 మార్కులకుగాను 119 మార్కులు సాధించిన కింతలి సాయి శ్రీ 20వ ర్యాంకుతో టాపర్‌గా నిలిచింది. అలాగే కొల్ల మౌనిక 119 మార్కులు సాధించి 40వ ర్యాంకు సాధించి రెండోస్థానంలో నిలిచింది. వాన దివాకర రావు 118 మార్కులు సాధించి 84వ ర్యాంకుతో మూడో స్థానంలో నిలిచాడు.



తల్లిదండ్రులతో 40వ ర్యాంకర్ మౌనిక

ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు కరెంట్ కష్టాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు చిమ్మ చీకట్లలో పరీక్షలు రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రతికూల వాతావరణం కారణంగా భారీ ఈదురుగాలులు, మెరుపులు, గర్జనలతో ప్రతిరోజూ కరెంట్ తీసేస్తున్నారు. దీంతో విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. ఇప్పటి వరకు మూడు రోజులపాటు పరీక్షలు జరగగా మధ్యలో ఒకరోజు మినహా మిగిలిన రెండు రోజులు కూడా విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. మధ్యాహ్నం పరీక్ష మొదలైన గంటన్నర తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోతోంది. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. కనీసం ప్రత్యామ్నాయ చర్యలైనా తీసుకోవాలని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులను విద్యార్థులు వేడుకుంటున్నారు.

ఇదెక్కడి వాతావరణం..?



శ్రీకాకుళంలోని కృష్ణాపార్కు కూడలి వద్ద పరిస్థితి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సిక్కోలు వాతావరణం భయపెడుతోంది. బుధవారం మధ్యాహ్నం నుంచి గాలివాన దుమారం ఊళ్లకు ఊళ్లను చుట్టేసింది. గాలుల ధాటికి మామిడి కాయలు ఎక్కువ సంఖ్యలో రాలిపోయాయి. మొక్కజొన్న, బొప్పాయి, జీడి మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస ప్రధాన మార్గంలో కల్వర్టు పనులు జరుగుతున్నందున పెద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రాగోలు దాటిన తర్వాత పెట్రోల్ బంకు దగ్గరలో, కొత్త రోడ్డు ముందు చర్చి దగ్గరలో వాహనాలు కిలోమీటరు పొడవున నిలిచిపోయాయి.

- జిల్లావ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు
- నేలకూలిన విద్యుత్‌స్తంభాలు
- వణికించిన పిడుగుపాట్లు

పిడుగు పడి ఈత చెట్టు దగ్ధం



టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్‌రోడ్డులో గల రైల్వే గేటు సమీపంలో గల ఈత చెట్టు పై పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో పెద్ద మంట చెలరేగి ఈత చెట్టు దగ్ధమైంది. ఈ శబ్దానికి చుట్టు పక్కల ఇళ్లల్లో ఉన్న ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

కూలిన పశువుల శాల

ఎల్.ఎన్.పేట: మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి అపార నష్టం చోటు చేసుకుంది. చింతలబడవంజ గ్రామానికి చెందిన సనపల నారాయణరావు ఇంటి ముందు ఉన్న పశువుల శాలపై పిడుగు పడడంతో గోడలతో పాటు పైకప్పు రేకులతో పాటు కూలిపోయింది. ఆ సమయంలో శాలలో పాడి పశువులు లేకపోవటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. మల్లికార్జునపురం వద్ద అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు పక్కనున్న చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. కొమ్మలు పడిన కొంత సమయం తర్వాత స్థానికులు కొమ్మలు తొలగించే పనులు చేపట్టారు.

పిడుగు పడి చూడి గేదె మృతి



కొత్తూరు: సిరుసువాడ పంచాయతీ పరిధి వైఎస్సార్ కాలనీ సమీపంలో బుధవారం సాయంత్రం పిడుగు పడి కొత్తకొత్తూరుకు చెందిన లోతుగెడ్డ చలపతిరావుకు చెందిన సుమారు రూ. 90 వేలు ఖరీదైన చూడి గేదె చనిపోయింది. మందపై పిడుగు పడడంతో గేదె చనిపోగా.. గేదెల కాపరి కాసింతలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.

విద్యుత్ శాఖకు నష్టం



అరసవల్లి: గాలుల తీవ్రతకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోగా విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అలాగే పిడుగుపాటుకు శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో సుమారుగా 7 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, సుమారు 25 వరకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ముఖ్యంగా 33 కేవీ విద్యుత్ లైన్లపై హోర్డింగులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు పడిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రంలో అయితే 11 కేవీ విద్యుత్ లైన్లు తెగిపడటంతో తీవ్ర అంతరా యం ఏర్పడింది. ఈ ప్రభావంతో సుమారుగా రూ. 10 లక్షల వరకు విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లినట్లుగా ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అవస్థలు



కొత్తూరు సీహెచ్‌సీలో విద్యుత్ లేక పోవడంతో సెల్‌ఫోన్ వెలుతురులో ఉన్న నవజాత శిశువులు

అంధకారంలో ఆస్పత్రి

కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం బుధవారం రాత్రి అంధకారంలో మగ్గిపోయింది. దీంతో ఆస్పత్రిలో ఉన్న నవజాత శిశువులు, బాలింతలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సెల్‌ఫోన్ వెలుతురుతోనే వైద్య సిబ్బంది వైద్యం అందించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భారీ ఈదురుగాలులకు విద్యుత్ నిలిచిపోయింది. ఆస్పత్రిలో ఉన్న ఇన్వెర్టర్లు కూడా చార్జింగ్ అయిపోవడంతో ఆస్పత్రి మొత్తం చీకటిగా మారిపోయింది. జనరేటర్ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. నవజాత శిశువులకు కనీసం ఇంజెక్షన్ కూడా ఇవ్వలేకపోతున్నారు. ఆస్పత్రి మొత్తం అంధకారంలో ఉన్నందున విష సర్పాల భయంతో రోగులు వణికిపోయారు. మరుగుదొడ్లకు నీరు లేకపోవడంతో ఇబ్బందులు అధికమయ్యాయి. ఈ విషయం ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాధ వద్ద ప్రస్తావించగా ఆస్పత్రికి జనరేటర్ లేదన్నారు. –కొత్తూరు



కొత్తూరు సీహెచ్‌సీలో సెల్‌ఫోన్ వెలుతురులో వైద్యం



చీకటిలో ఇబ్బందులు పడుతున్న రోగులు



అంధకారంలో కొత్తూరు సీహెచ్‌సీ

క్లుప్తంగా

ఆకాశవాణి ఏ-గ్రేడ్ ఆర్టిస్ట్‌గా సత్యవరప్రసాద్



కవిటి: బెనారస్ హిందూ యూనివర్సిటీలో మృదంగం విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ బొంతలకోటి సత్యవరప్రసాద్ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఇటీవల నిర్వహించిన ఆడిషన్‌లో ఏ-గ్రేడ్ ఆర్టిస్ట్‌గా అర్హత సాధించారు. ఈ మేరకు హైదరాబాద్ ఆకాశవాణి కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయని సత్యవరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వగ్రామం కవిటి మండలం కుసుంపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నారాయణపురం ఆయకట్టుకు నిధులు మంజూరు

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్‌లో సాగునీటి సమస్య పరిష్కారానికి నారాయణపురం ఆయకట్టుకు రూ.34.63 లక్షల నిధులను జలవనరులు శాఖ అధికారులు మంజూరు చేశారు. జంగిల్ క్లియరెన్స్, ఇసుక పొరల తొలగింపు, షట్టర్లు, మదుముల మరమ్మతులకు ఈ నిధులు వినియోగిస్తారు. సజావుగా సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక వాహనాలు సీజ్



అధికారులకు పట్టుబడిన వాహనాలు

కొత్తూరు: మండలంలోని అంగూరు ఇసుక ర్యాంపు(ఆకులతంపర) వద్ద బుధవారం జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నట్లు తహశీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. నది మధ్యలో అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్న ప్రొక్లెయిన్, జేసీబీ, లారీలు, ట్రిప్పర్లు మొత్తం ఆరు వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు.

ఉపాధి వేతనదారుడికి పాముకాటు

మెళియాపుట్టి: మండలంలోని చాపర పంచాయతీలో పరిధిలో బుధవారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తుండగా డోల అప్పడు అనే 60 ఏళ్ల వృద్ధుడు పాముకాటుకు గురయ్యాడు. వెంటనే తోటి వేతనదారులు ఫీల్డ్ అసిస్టెంట్ సింహాచలంకు తెలియజేయడంతో హుటాహుటిన పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వృద్ధుడి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పట్టాలపై మృతదేహం

కాశీబుగ్గ/ఇచ్ఛాపురం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని సుర్లా రోడ్డు రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస జీ.ఆర్.పి. పోలీసుస్టేషన్ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇచ్ఛాపురం-సుర్లారోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ లైనులో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుందని చెప్పారు. మృతుడి వయసు 55-60 ఏళ్లు ఉండవచ్చని, కాషాయ రంగు టీషర్టు, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నాడని, చేతి కర్ర, సంచి ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు 94406 27567 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్ : మద్యానికి బానిసై చిలకపాలెం గ్రామానికి చెందిన సారిపల్లి జనార్దన్ (31) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనార్దన్ ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. భార్య ధనలక్ష్మి, కుమారుడు ఉన్నారు. జనార్దన్ రోజు సంపాదన మొత్తం మద్యం తాగేందుకే ఖర్చు చేస్తుండటంతో కొన్నాళ్లుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల క్షయ వ్యాధి రావటంతో మందులు వాడుతున్నాడు. అయినా మద్యం ఆపకపోవడంతో భార్య ధనలక్ష్మి గొడవపడి బుధవారం శ్రీకాకుళంలో షాపులో పనికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన జనార్దన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన భార్య భర్త మృతి చెందిన విషయం గమనించి ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

55 పశువులు పట్టివేత

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలో రామతీర్థాలు కూడలి వద్ద జాతీయ రహదారిపై ఐదు బొలెరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 55 పశువులను జె.ఆర్.పురం పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని పలు గ్రామాల నుంచి విశాఖపట్నం గోవధశాలకు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 9 మందిపై కేసు నమోదు చేశారు. పశువులను విజయనగరం జిల్లా గుజ్జంగివలసలోని గో-సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

దర్జాగా.. తవ్వేస్తున్నారు!



కొండను తవ్వి గ్రావెల్ లోడ్ చేస్తున్న దృశ్యం

టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

- గోవిందపురం కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలింపు
- అనుమతులు లేకపోయినా టిప్పర్ల ద్వారా రవాణా
- ఇదేంటని ప్రశ్నించిన సర్పంచ్‌పై దురుసు ప్రవర్తన

సంతబొమ్మాళి: మండలంలోని గోవిందపురం సర్వే నెంబర్ 71లో కొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రెవెన్యూ, పంచాయతీ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకపోయినా దౌర్జన్యంగా టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. లక్షల రూపాయలను సొమ్ముచేసుకుంటున్నారు. అక్రమ తరలింపుపై ప్రశ్నించిన స్థానిక సర్పంచ్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు నిర్వాహకులు విశ్వసముద్రం సంస్థ ద్వారా మూలపేట పోర్టు పనులకు గ్రావెల్‌ను తరలిస్తున్నామని చెబుతున్నారు. ఆర్డర్ కాపీ చూపించాలని కోరగా..ఆర్డీవో వద్దకు వెళ్లి అడగండంటూ దురుసుగా సమాధానం ఇస్తున్నారు. వాస్తవానికి సర్వే నెంబర్ 71లో ఉన్న ఈ కొండను గ్రామానికి చెందిన మండపాక నర్సింగరావు 2020-30 సంవత్సరం వరకు లీజుకు తీసుకున్నారు. ఏటా హెక్టార్‌కు రూ.65వేలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నట్లు లీజుదారు చెబుతున్నారు. తనకు లీజుకిచ్చిన గ్రావెల్ కొండను ఇతరులు తరలించుకుపోతున్నారని జిల్లా మైన్స్ విజిలెన్స్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ మేరకు మంగళవారం ఏడీ అశోక్ వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను సీజ్ చేయాలని పోలీసులకు ఆదేశించారు. సీజ్ చేసిన గంటలోపే మళ్లీ గ్రావెల్‌ను తరలించే ప్రక్రియ ప్రారంభం కావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోర్టు పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ గ్రావెల్‌ను తరలించుకుపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

న్యాయపోరాటం తప్పదు..

కింజరాపు కుటుంబీకుల కనుసన్నల్లోనే గ్రావెల్‌ను ఎటువంటి అనుమతులు లేకుండా తరలించుకుపోతున్నారు. లీజుదారుడైన నన్ను సంప్రదించకుండా దౌర్జన్యంగా గ్రావెల్ తీసుకెళ్తున్నారు. జిల్లా మైన్స్ విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై న్యాయపోరాటం చేస్తాను.

– మండపాక నర్సింగరావు, లీజుదారుడు, వల్లేవలస

దురుసుగా సమాధానం..

అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోవడంతో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లాను. మీకు ఎటువంటి అనుమతులు ఉన్నాయో పత్రాలు చూపించండని కోరాం. ఆర్డీవో దగ్గర పర్మిషన్ ఆర్డర్ ఉంది వెళ్లి చూసుకోండి అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు.

– ఆర్.రామిరెడ్డి, సర్పంచ్, గోవిందపురం

ఎక్కడి వాహనాలు అక్కడే..



కొత్తరోడ్డు సమీపంలో నిలిచిన వాహనాలు



వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు

- కొత్తరోడ్డు-నందగిరిపేట మధ్య ట్రాఫిక్ జామ్
- వందల సంఖ్యలో నిలిచిన వాహనాలు
- ఎండలో ప్రజల నరకయాతన

ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్/శ్రీకాకుళం రూరల్: జిల్లాలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన శ్రీకాకుళం-పాలకొండ-పార్వతీపురం రహదారి బుధవారం స్తంభించిపోయింది. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు నాలుగు లైన్ల రోడ్డుగా ఇటీవల అభివృద్ధి చెందుతున్న ఈ రహదారిలో పలుచోట్ల కల్వర్టుల నిర్మాణం జరుగుతోంది. ఇదే క్రమంలో ఆయా గ్రామాల పరిధిలో అమ్మవార్ల పండగలు బుధవారం జరగడంతో భారీగా జనం తరలివచ్చారు. ఈ క్రమంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ముఖ్యంగా కొత్త రోడ్డు సమీపంలోని చర్చి వద్ద ఉన్న ప్రధాన కాలువ కల్వర్టు పనులు కొన్నాళ్లుగా నిలిచిపోవడంతో ఇక్కడ నిత్యం వాహనాలు నిలిచిపోతున్నాయి. రాయిపాడు జంక్షన్ వద్ద కల్వర్టు ఒకవైపు తవ్వకాలు జరపటం చర్చి వద్ద ఉన్న కల్వర్టు ప్రాంత పక్క రహదారిని మూసివేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇదే రహదారి సమీపంలో ఆమదాలవలస మండలం వంజంగి, గట్టుముడిపేట గ్రామాల్లో అమ్మవారి పండుగలు నిర్వహించడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో జనం తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి కొత్త రోడ్డు ప్రాంతం నుంచి నందగిరిపేట వరకు ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. బస్సులు, లారీలు, కార్లలో గంటల తరబడి ఉండిపోయారు. ఆసుపత్రులకు రోగులను తరలించే అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. సుమారు మూడు గంటల పాటు ద్విచక్ర వాహనచోదకులు నరకయాతన అనుభవించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రధాన రహదారిపైకి వచ్చి భారీ వాహనాలను కొత్త రోడ్డు నుంచి సింగుపురం వైపు చింతాడ మీదుగా తరలించడంతో కొంతమేర ఊరట లభించింది.

రిమ్స్ సూపరింటెండెంట్‌గా అమూల్య



శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సి.అమూల్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా నుంచి బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అమూల్యను ప్రభుత్వం ఇటీవలే ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది సహకారంతో రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో ఓపీ సంఖ్య పెరిగేలా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం పలువురు వైద్యులు సిబ్బంది అమూల్యను అభినందించారు.

9 మంది పేకాటరాయుళ్లపై కేసు

గార: మండలంలోని పూసర్లపాడులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని గార ఏఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. బుధవారం గ్రామ సమీపంలోని తోటల్లో ఆడుతున్న వీరిని టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.10,620 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

మోసపోయిన చార్‌ధామ్ యాత్రికులు

కాశీబుగ్గ : కాశీబుగ్గకు చెందిన పలువురు యాత్రికులు ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు వెళ్లి ఓ ట్రావెల్ ఏజెన్సీ చేతిలో మోసపోయారు. వీరంతా గంగోత్రిని సందర్శించిన అనంతరం కేదార్ లోయకు వెళ్లారు. అక్కడ ప్రయాణ ప్యాకేజీ, హెలికాప్టర్ టికెట్‌కు ఒక్కొక్కరు రూ.30 వేలు చెల్లించారు. అయినప్పటికీ హెలికాప్టర్ ఎక్కించలేదని యాత్రికులు వాపోయారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

20న అఖిల భారత సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

రణస్థలం: కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణ కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం రణస్థలంలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం పెంచాలని, కనీస పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, పని భారం తగ్గించాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు కె.సుజాత, పెద్దింటి కాంతమ్మ, ఎస్.జయలక్ష్మి, బి.గౌరి, కెల్ల ఉషా, ఎం.అన్నపూర్ణ, ఎ.అరుణ పాల్గొన్నారు.

ఉద్దాన విధ్వంసాన్ని సహించేది లేదు



కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి పచ్చని ఉద్దాన ప్రాంతంలో విధ్వంసానికి పాల్పడితే సహించేది లేదని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరులో బుధవారం కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుపచ్చ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ప్రజల భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి ప్రజలను నిరాశ్రయులుగా చేయడం సరికాదన్నారు. ఉద్దాన ప్రాంతంలో కొబ్బరి, జీడిపంటలను నమ్ముకొని వేలాది మంది ప్రజలు జీవనోపాధి సాగిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మేలును ఆకాంక్షిస్తే వెంటనే కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఉద్దాన ప్రజలకు మేలు కలిగించే ఉద్దాన పంటల ఆధారిత పరిశ్రమలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే ముందుగా ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకొని ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు, శివారు భూములకు సాగునీరు అందించే పనులపై దృష్టిపెట్టాలన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మౌనం వీడి ఉద్దాన ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీడి రైతు పోరాట కమిటీ అధ్యక్షుడు తెప్పల అజయ్‌కుమార్, రైతు సంఘ జిల్లా కార్యదర్శి కోనారి మోహన్‌రావు, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, సీఐటీయూ నాయకులు ఎన్.గణపతి, కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ నాయకులు కుసుమ, దానేష్, చలపతి, పి.అరుణ, ధర్మారావు, జోగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ప్రచార కక్కుర్తి?



టీడీపీ నాయకులు ప్రచార ఆర్భాటం హద్దులు దాటుతోంది. పలాస మండలం చినంచల సచివాలయం వద్ద ఏకంగా ప్రారంభోత్సవ శిలా ఫలకంపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా పుట్టినరోజు వేడుకల పోస్టర్లు అతికించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదని స్థానికులు మండిపడుతున్నారు. – కాశీబుగ్గ

ఉపాధిలో జియో ట్యాగింగ్ కీలకం



రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర నోడల్ అధికారి సుగుణాకరరావు

మెళియాపుట్టి: ఉపాధి హామీ పథకంలో జియో ట్యాగింగ్ విధానం కీలకమైనదని, దానికి అనుగుణంగా పనులు నిర్వహించాలని జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి వి.సుగుణాకరరావు అన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి మెళియాపుట్టి వచ్చిన ఆయన స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో నిర్మించిన రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భజలాల పరిరక్షణ ఇటువంటి నిర్మాణాలు మరిన్ని చేపట్టాలన్నారు. అనంతరం గోకర్ణపురంలో పంట కుంటను పరిశీలించారు. అంతకుముందు స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా జీబీఎస్ అధికారి శోభ, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు తిరుపతిరావు, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల సమస్యలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రెవెన్యూ భూముల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ భూ సమస్యలు, ఎలినేషన్స్, మ్యుటేషన్లపై జిల్లా అధికారులు, తహసీల్దార్లతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తీరప్రాంత తహసీల్దార్లు సీఆర్‌జెడ్ రూల్స్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. జెడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా మాట్లాడుతూ డీఎల్‌డీఓ కార్యాలయానికి రెండు ఎకరాలు అవసరమని చెప్పగా ఆర్డీఓ సాయి ప్రత్యూష స్పందిస్తూ కలెక్టరేట్ నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఆర్డీఓలు కె.సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, పీడీ బి.శాంతిశ్రీ, సెరీకల్చర్ ఏడీ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు మోక్షమెప్పుడో?

- లక్ష్యం 3133 యూనిట్లు.. దరఖాస్తులు 22,822
- తూతూమంత్రంగా మండల స్థాయి ఇంటర్వ్యూలు
- బ్యాంకర్లపై కూటమి నేతల ఒత్తిడి!

శ్రీకాకుళం పాతబస్టాండ్:

వెనుకబడిన తరగతుల్లో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అందని ద్రాక్షలా మారాయి. కేవలం కూటమి ప్రభుత్వం కార్యకర్తలకు వరంగా మార్చుకుంటున్నారు తప్ప ఎక్కడా పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటర్వ్యూలు, దరఖాస్తుల ప్రక్రియ అంతా తూతూమంత్రంగానే ఉందని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతా రాజకీయ జోక్యమే..

దరఖాస్తుల ప్రక్రియ మొదలైన నాటి నుంచి రుణాల పంపిణీపై రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో అర్హతలు ఉన్న సామాన్యులు ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్నికలకు ముందు ఇబ్బడిముబ్బడిగా హామీలను గుప్పించి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల పదవీ కాలంలో పింఛన్ల పెంపు పథకాన్ని తప్ప మరే ఇతర పథకాన్ని అమలు చేసిన దాఖలాలు లేవు. హామీలను నెరవేర్చలేమంటూ కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తున్న తరుణంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో బీసీ రుణాలను మంజూరుకు కూటమి ప్రభుత్వ పెద్దలు శ్రీకారం చుట్టారు. ఈ రుణాలు కూడా అందరికి అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయి. యూనిట్లు తక్కువగా ఉండటంతో దరఖాస్తుదారులు ఎక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం నెలకొంది. బ్యాంకు, ఇతర అధికారులతో పనిలేకుండా నేరుగా నియోజకవర్గాల శాసన సభ్యులు సిపారసు లేఖలే ప్రామాణికంగా ఎంపికలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బీసీలకు బాసట కరువు..

జిల్లాలో ఎక్కువగా బీసీ సామాజికవర్గాల వారే ఉన్నారు. ఆ వర్గానికి ఆర్థిక వనరులు అంతంత మాత్రంగానే ఉండటంతో నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు ఎక్కువ యూనిట్లు మంజూరి చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించలేదు. బీసీ జనాభాను ప్రాతిపదికగా తీసుకుంటే బీసీలకు మరిన్ని యూనిట్లు వచ్చి మేలు జరిగే అవకాశం ఉండేది. పేద జిల్లా అయినందున స్వయం ఉపాధిని పొందేందుకు బీసీ రుణాల కోసం అధిక సంఖ్యలో యువత ముందుకు వస్తున్నా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఫలితం లేకుండాపోతోంది.

ఇంటర్వ్యూలు పూర్తయినా..

బీసీ రుణాల కోసం జిల్లా వ్యాప్తంగా ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. అయితే ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్న వారికి అప్‌డేట్ మాత్రం ఇవ్వడం లేదు. ఎంపీడీవోలు తరువాత మీకు సమాచారం పంపుతామని చెప్పి పంపించేస్తున్నారు. ఎంపిక జాబితాలను మాత్రం వెల్లడించడం లేదు.

బీసీ రుణాలు రకం	లక్ష్యం	రిజిస్ట్రేషన్
సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం	2724	21186
జనరల్ మెడికల్ షాపులు	55	56
ఫైనాన్షియల్ అసిస్టెన్స్	208	208
(మేదరి, కుమ్మరి, శ్రీశయన)		
బీసీ స్కీంలు(మొత్తం)	2987	21450
ఈడబ్ల్యూఎస్ (సెల్ఫ్ ఎంప్లాయిమెంట్)	41	478
కాపు (చంద్రన్న స్వయం ఉపాధి)	105	894
మొత్తం స్కీంలు	3133	22822

బ్యాంకర్లకు తలనొప్పులు..

లబ్ధిదారుల ఎంపికలో బ్యాంకులు కీలక భూమిక పోషించాల్సి ఉంది. లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇవ్వగా, మిగిలిన 50 శాతం రుణం బ్యాంకు వారు అందజేయాలి. అయితే బ్యాంకు అనుమతి లేకుండా కూటమి నాయకులు లబ్ధిదారుల పేర్లను సిఫారసులు చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మందికి రుణం పొందేందుకు కావాల్సిన 'సిబిల్ స్కోర్' అనుకూలంగా లేనందున బ్యాంకర్లు రుణం ఇచ్చేందుకు సుముఖత చూపడం లేదు. ఈ సమయంలో నాయకులు బ్యాంకులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ పరిస్థితి బ్యాంకర్లకు తలనొప్పిగా మారింది.